వైసీపీ నాయకుడు నాగార్జున యాదవ్‌పై కూటమి నేతల ఘాటు విమర్శలు



కృష్ణాజుల్లా/గన్నవరం (వాయిస్ టుడే): గన్నవరం నియోజకవర్గంలో ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాలు, నియోజకవర్గ అభివృద్ధిపై వైసిపి అధికార ప్రతినిధి నాగార్జున యాదవ్ చేసిన వ్యాఖ్యలపై కూటమి నాయకులు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావుపై వ్యక్తిగత విమర్శలు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. గన్నవరం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో టీడీపీ సీనియర్ నాయకులు దొంతు చిన్నా, విజయవాడ రూరల్ మండల అధ్యక్షులు గోడళ్ల చిన రామారావు, నియోజకవర్గ తెలుగు మహిళా అధ్యక్షురాలు మేడేపల్లి రమ, పెద్ద అవుటపల్లి గ్రామ పార్టీ అధ్యక్షుడు మున్నా రామకృష్ణ, మచిలీపట్నం పార్లమెంటు కమిటీ సభ్యుడు జొన్నలగడ్డ సుధాకర్, జనసేన జిల్లా సంయుక్త కార్యదర్శి, ఎంపీటీసీ చిమాట రవివర్మ, మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో గన్నవరం నియోజకవర్గంలో కూటమి స్పష్టమైన ఆధిపత్యం ప్రదర్శించిందని నాయకులు తెలిపారు. మొత్తం 91 స్థానాలకు గాను 64 స్థానాలను కూటమి గెలుచుకుందని, నాలుగు జడ్పీటీసీ స్థానాల్లో మూడింటిని కైవసం చేసుకుందని పేర్కొన్నారు. ఒక్క జడ్పీటీసీ స్థానంలో మాత్రమే కూటమి అభ్యర్థి చిగురుపాటి కుమారస్వామి స్వల్ప తేడాతో వెనుకబడ్డారని చెప్పారు. ఓట్ల లెక్కింపుపై సందేహాలు ఉండటంతో చట్టబద్ధంగా రీకౌంటింగ్ కోరామని, అది తమ ప్రజాస్వామ్య హక్కు అని స్పష్టం చేశారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రతిపక్ష అభ్యర్థులను నామినేషన్లు వేయకుండా అడ్డుకోవడం, నామినేషన్ పత్రాలు చించివేయడం, కౌంటింగ్ సమయంలో విద్యుత్తు నిలిపివేసి అక్రమాలకు పాల్పడటం వంటివి తాము చేయలేదని అన్నారు. అలాంటి చరిత్ర ఉన్న వైసిపి నాయకులు ప్రజాస్వామ్యం గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు.వైసిపి నాయకులు అవినీతి గురించి మాట్లాడటం దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉందని కూటమి నేతలు విమర్శించారు. గత పదేళ్లలో గన్నవరం నియోజకవర్గంలో మట్టి తవ్వకాలు, చెరువుల ఆక్రమణలు, పేకాట క్లబ్బులు, కోడిపందాలు, కబ్జాలు, సెటిల్మెంట్లు మాత్రమే జరిగాయని ఆరోపించారు. నాటి ఎమ్మెల్యే వల్లభనేని వంశీ హయాంలో చోటుచేసుకున్న అక్రమాలను ప్రశ్నించిన నాయకుల ఇళ్లపై దాడులు చేయించి, వారిని జైలుకు పంపిన చరిత్ర వైసిపి దే అని గుర్తుచేశారు. అవినీతి గురించి మాట్లాడే ముందు గతంలో జరిగిన వ్యవహారాలపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. గన్నవరం నియోజకవర్గంలో అభివృద్ధి జరగలేదని విమర్శిస్తున్న యాక్ నాయకులు ప్రసాదంపాడు రహదారిని పరిశీలించాలని సూచించారు. గత ప్రభుత్వ హయాంలో ఆ రహదారి గుంతలమయంగా మారి ప్రమాదాలు జరుగుతున్నా అప్పటి పాలకులు పట్టించుకోలేదన్నారు. యార్లగడ్డ వెంకట్రావు ఎమ్మెల్యేగా గెలిచిన వెంటనే ఆ రహదారి నిర్మాణాన్ని పూర్తి చేయించారని తెలిపారు. దీంతో స్థానిక ప్రజలు, ప్రజాప్రతినిధులు కృతజ్ఞతగా ఆ మార్గానికి 'యార్లగడ్డ మార్గ్' అని పేరు పెట్టుకున్నారని వివరించారు. నియోజకవర్గంలో చేసిన వందల కోట్ల అభివృద్ధి పనులు వైసీపీ నాయకులకు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తుంటే విమర్శలు చేయడం తగదన్నారు. బీసీ సామాజికవర్గాల పేరుతో కులాల మధ్య విభేదాలు సృష్టించేందుకు నాగార్జున యాదవ్ ప్రయత్నిస్తున్నారని జనసేన నాయకుడు చిమాట రవివర్మ ఆగ్రహం వ్యక్తం చేశారు. బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించి రాజకీయంగా అండగా నిలిచిన ఘనత తెలుగుదేశం పార్టీదేనని గుర్తుచేశారు. తాను బీసీ యాదవ సామాజికవర్గానికి చెందిన అభ్యర్థిగా పోటీ చేసిన సమయంలో ఇతర సామాజికవర్గాల అభ్యర్థులు బరిలో ఉన్నప్పటికీ యార్లగడ్డ వెంకట్రావు తనకు మద్దతుగా నిలిచారని తెలిపారు. గుంటూరు నుంచి వచ్చి ఎవరో రాసిచ్చిన మాటలను విలేకరుల సమావేశాల్లో చదువుతూ వ్యక్తిగత విమర్శలు చేయడం మానుకోవాలని నాగార్జున యాదవ్ కు హితవు పలికారు. కులాల మధ్య చిచ్చు పెట్టే ప్రయత్నాలను సహించేది లేదని హెచ్చరించారు. నియోజకవర్గ అభివృద్ధి, అవినీతి అంశాలపై వైసీపీ నాయకులకు నిజంగా చిత్తశుద్ధి ఉంటే బహిరంగ చర్చకు రావాలని కూటమి నేతలు సవాల్ విసిరారు. వ్యక్తిగత విమర్శలు మాని ఆధారాలతో మాట్లాడాలని సూచించారు. గన్నవరం నియోజకవర్గ ప్రజలకు ఎవరు ఏం చేశారో తెలుసని, అభివృద్ధి విషయంలో ప్రజలే తగిన సమాధానం చెబుతారని పేర్కొన్నారు. ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు నాయకత్వంలో నియోజకవర్గ అభివృద్ధి కొనసాగుతుందని వారు స్పష్టం చేశారు.



గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావుపై వైసిపి నేత నాగార్జున యాదవ్ వ్యక్తిగత విమర్శలు చేయడం సరికాదు: సర్నాల బాలాజ

కృష్ణా/ఎన్టీఆర్ జిల్లా(వాయిస్ టుడే): ఏపీ ప్రభుత్వ విప్, గన్నవరం నియోజకవర్గ శాసనసభ్యుడు యార్లగడ్డ వెంకట్రావుపై వైసీపీ నాయకుడు నాగార్జున యాదవ్ చేసిన అనుచిత వ్యాఖ్యలపై నియోజకవర్గ టీడీపీ బీసీ నాయకుడు సర్నాల బాలాజీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రసాదంపాడులో తన కార్యక్రమంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం లో ఆయన మాట్లాడుతూ రాజకీయ విమర్శలు రాజకీయాల వరకే పరిమితం కావాలని, వ్యక్తిగత దూషణలకు దిగడం సరికాదని హితవు పలికారు. గన్నవరం అభివృద్ధి గురించి మాట్లాడే ముందు గత పదేళ్ల వైసిపి పాలనలో ఏం అభివృద్ధి చేశారో చెప్పాలని నాగార్జున యాదవ్‌ను ప్రశ్నించారు. ప్రసాదంపాడు గ్రామంలో గతంలో గుంతలమయంగా ఉన్న రహదారిని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ప్రత్యేక శ్రద్ధతో అభివృద్ధి చేయించారని తెలిపారు. వేలాది మంది ప్రయాణించే ఆ రహదారిని అభివృద్ధి చేసినందుకు కృతజ్ఞతగా గ్రామ నాయకులంతా కలిసి సొంత ఖర్చులతో ఆర్చి నిర్మించి, గ్రామపంచాయతీ తీర్మానంతో 'యార్లగడ్డ వెంకట్రావు మార్గ్'గా పేరు పెట్టుకున్నామని వివరించారు. ప్రజలకు ఉపయోగపడే అభివృద్ధి చేసిన నాయకుడికి కృతజ్ఞతగా పేరు పెట్టుకుంటే తప్పేంటని ప్రశ్నించారు. బీసీలు, ఎస్సీలకు ఎమ్మెల్యే దూరంగా ఉంటున్నారంటూ చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. "నేను బీసీని కాదా? నా పేరు సర్నాల బాలాజీ. నేను యాదవుడిని కాదా? బీసీలకు ఎమ్మెల్యే దూరమని ఏ ఆధారంతో మాట్లాడుతున్నారు?" అని నిలదీశారు. కాలనీలకు నాయకుల పేర్లు పెట్టడంపై విమర్శలు చేస్తున్న నాగార్జున యాదవ్ ముందుగా వైసిపి హయాంలో పెట్టిన జగనన్న కాలనీలు, జగనన్న గోరుముద్ద, జగనన్న అమ్మ ఒడి వంటి పేర్లపై సమాధానం చెప్పాలని అన్నారు. గన్నవరం అభివృద్ధిపై చర్చించడానికి సిద్ధంగా ఉంటే బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు. ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావుపై మరోసారి వ్యక్తిగత, అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని, అవసరమైతే చట్టపరమైన చర్యలు తీసుకోవడానికి వెనుకాడబోమని సర్నాల బాలాజీ హెచ్చరించారు.



ఇందిరమ్మ ఇళ్ల పథకంతో ప్రతి పేద కుటుంబానికి సొంతింటి భరోసా

బొరేగావ్‌లో నూతన ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశంలో పాల్గొన్న ఝరాసంగం మండల కాంగ్రెస్ అధ్యక్షులు ఉదయ్ శంకర్ పాటిల్

జహీరాబాద్ (వాయిస్ టుడే), నవంబర్ 11: సంగారెడ్డి జిల్లా ఝరాసంగం మండల పరిధిలోని బొరేగావ్ గ్రామంలో, రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఝరాసంగం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఉదయ్ శంకర్ పాటిల్ హాజరై, ప్రత్యేక పూజలు నిర్వహించి గృహప్రవేశ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటి యజమానులు ఉదయ్ శంకర్ పాటిల్‌ను శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పేద ప్రజల సొంతింటి కలను సాకారం చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం పేదల పాలిట ఒక వరమని పేర్కొన్నారు. నూతన గృహంలోకి అడుగుపెట్టిన కుటుంబ సభ్యులకు ఆయన శుభాకాంక్షలు తెలుపుతూ,వారు ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో జీవించాలని, అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బొరేగావ్ గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు, వివిధ గ్రామాల సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, సీనియర్ నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



చెరకు రైతులకు టన్నుకు రూ.4,500 మద్దతు ధర కల్పించాలి

తెలంగాణ రాష్ట్ర చేరుకు శాఖ కమిషనర్ కమిషనర్‌ను వినతి పత్రం అందజేసిన జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్ రావు, మాజీ డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్

జహీరాబాద్ వాయిస్ టుడే నవంబర్ 11: జహీరాబాద్ నియోజకవర్గ పరిధిలోని చెరకు రైతుల సమస్యలను పరిష్కరించి, వారు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని కోరుతూ జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్ రావు, మాజీ డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్ మంగళవారం హైదరాబాద్‌లో తెలంగాణ రాష్ట్ర చెరకు శాఖ కమిషనర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు..ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జహీరాబాద్ నియోజకవర్గ పరిధిలో సుమారు 49,592 ఎకరాల్లో చెరకు సాగు జరుగుతుండగా, ఏటా 12,39,800 మెట్రిక్ టన్నుల చెరకు ఉత్పత్తి అవుతోందని తెలిపారు. అయితే గత మూడు సంవత్సరాలుగా స్థానిక చక్కెర కర్మాగారం మూతపడటంతో చెరకు రైతులు తమ పంటను విక్రయించుకోవడానికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

సింగీతంలో లబ్ధిదారులకు రేషన్ కార్డుల పంపిణీ

జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంజయ్య చేతుల మీదుగా పంపిణీ



జహీరాబాద్ వాయిస్ టుడే నవంబర్ 11: సంగారెడ్డి జిల్లా రాయికోడ్ మండలంలోని సింగీతం గ్రామంలో బుధవారం రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంజయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. స్థానిక సర్పంచ్ శ్రావణి నిరంజన్‌తో కలిసి లబ్ధిదారులకు రేషన్ కార్డులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేయాలని నాయకులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో రాయికోడ్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు.కేదార్‌నాథ్ పటేల్, మాజీ యూత్ అధ్యక్షుడు ప్రభాకర్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ వినయ్ కుమార్, మండల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు రఫీక్, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



సోమేశ్వర బండ గ్రామ కాంగ్రెస్ నూతన కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

మక్తల్, నవంబర్ 11 వాయిస్ టుడే ప్రతినిధి: తెలంగాణ రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి ఆదేశాల మేరకు మక్తల్ మండల పరిధిలోని సోమేశ్వర బండ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ నూతన గ్రామ కమిటీని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడిగా నర్సిములును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అలాగే నూతన కమిటీలో ఉపాధ్యక్షులు, కోశాధికారి తదితర బాధ్యతలకు నాయకులను ఎంపిక చేశారు. గ్రామ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తల సమక్షంలో ఐక్యతతో, ఉత్సాహభరిత వాతావరణంలో ఈ ఎన్నికలు నిర్వహించారు. నూతనంగా ఎన్నికైన కమిటీ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని నాయకులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మక్తల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శ్రీనివాసులు గౌడ్, సీనియర్ నాయకులు కట్ట సురేష్ కుమార్ గుప్తా, సర్పంచ్ సత్యరెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు చెన్నయ్య గౌడ్, ఇతర ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతన గ్రామ అధ్యక్షుడిగా ఎన్నికైన నర్సిములుకు నాయకులు, కార్యకర్తలు శుభాకాంక్షలు తెలిపారు.





హుజూర్‌నగర్ పట్టణంలో నిర్మాణంలో ఉన్న ఆర్ అండ్ బి, ఇరిగేషన్ కార్యాలయాల పనులను పరిశీలించిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

హుజూర్‌నగర్: నవంబర్,11 (వాయిస్ టుడే ప్రతినిధి): హుజూర్‌నగర్ పట్టణంలో రూ .8 కోట్ల వ్యయంతో నిర్మాణం చేపట్టిన ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్, డివిజన్ కార్యాలయం, కాంప్లెక్స్ నిర్మాణ పనులను బుధవారం రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి పరిశీలించారు.అనంతరం పక్కనే మరో రూ.8 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న ఇరిగేషన్ డివిజన్ కార్యాలయం, కాంప్లెక్స్ నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించారు.ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ నిర్మాణ పనులను యుద్ధ ప్రాతిపదికన వేగవంతం చేయాలని, నిర్ణీత గడువులోగా నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ పనులను పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. నిర్మాణంలో ఎలాంటి నాణ్యతా లోపాలు లేకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నల్లగొండ ఎంపీ శ్రీ కుందూరు రఘువీర్ రెడ్డి మున్సిపల్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



అయ్యప్ప స్వామి పడిపూజ

నడిగూడెం, నవంబర్11 (వాయిస్ టుడే ప్రతినిధి): నడిగూడెం మండలం రత్నవరం గ్రామంలో పొలంపల్లి అశోక్ స్వామి నిర్వహించిన శ్రీ అయ్యప్ప స్వామి వారి పడి పూజ మహోత్సవంలో కోదాడ మాజీ శాసనసభ్యులు శ్రీ బొల్లం మల్లయ్య యాదవ్ పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం స్వామివారికి అభిషేకం చేశారు. ఈ సందర్భంగా అయ్యప్ప స్వామివారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని బొల్లం మల్లయ్య యాదవ్ ఆకాంక్షించారు. అయ్యప్ప స్వామి దీక్ష అనేది కేవలం ఆధ్యాత్మిక సాధన మాత్రమే కాకుండా క్రమశిక్షణ, భక్తి, సహనం, సమానత్వం, సేవాభావం వంటి గొప్ప విలువలను నేర్పుతుందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ భక్తి మార్గంలో పయనిస్తూ ఆధ్యాత్మిక చింతనను అలవర్చుకోవాలని, సమాజంలో ఐకమత్యం, సోదరభావం పెంపొందించుకోవాలని సూచించారు. ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు గ్రామాల్లో భక్తిభావాన్ని పెంపొందించడంతో పాటు ప్రజల మధ్య ఐక్యతను బలోపేతం చేస్తాయని తెలిపారు. ఈ సందర్భంగా పడి పూజ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించిన నిర్వాహకులకు, అయ్యప్ప స్వామి భక్తులకు ఆయన అభినందనలు తెలియజేశారు.